క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: మున్సిపాలిటీలోని టౌన్–1 ఫీడర్ పరిధిలోని కాలనీల్లో విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కోసం బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. టౌన్–1 పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, అంబేద్కర్ కాలనీ, చర్చిరోడ్డు, కొత్తగూడెం, ఓల్డ్ సినిమా టాకీస్, మంగళిబజార్, చింతలగూడెం, బట్టిగూడెం, గాంధీచౌక్, ఆసుపత్రి, చెరువుకట్ట, శివాలయం, కొటబొగుడ, ఎమ్మెల్యే కాలనీ, గ్రంథాలయం, జెండవాడ, జగన్నాథాలయం, రాజీవ్‌రోడ్డు, కూరగాయల మార్కెట్, ఉర్దూ స్కూల్, పుష్పాల హనుమాన్, బడా హనుమాన్, చాకలివాడ, కుమ్మరిబొడుగ, మారెమ్మవాడ, కొటంవాడ, గోదావరిరోడ్డు, బొక్కలగూడెం, బెస్తావాడ, కాజీపూరా, బ్రాహ్మణవాడలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినయోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి

దండేపల్లి: అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో దండేపల్లి మండలానికి చెందిన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ సంధ్యారాణికి మంగళవారం వినతిపత్రం అందించారు. దండేపల్లి మండలంలో నివాసానికి యోగ్యంగా ప్రభుత్వ భూములు ఉంటే వాటిని కేటాయించడం, లేదంటే లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాల్లో గల ప్రభుత్వ భూముల్లో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి, హక్కు పత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలి

పాతమంచిర్యాల: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు మున్సిపాలిటీలకు చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సు ఫీజును నిబంధనలను అనుసరించి చెల్లించాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ నల్లనాగేంద్రప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీ నయీంపాషా పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీపార్టీ విద్యార్థి విభాగం కన్వీనర్ కొంటు రాజేందర్, నాయకులు విజయ్, శ్రీకాంత్, సలీం, కల్యాణ్, సంతోష్, సంజయ్ పాల్గొన్నారు.

కార్యదర్శులకు క్రీడాకిట్లు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మండలంలోని కార్యదర్శులకు మంగళవారం క్రీడా ప్రాంగణాలకు సంబంధించి క్రీడాకిట్లు పంపిణీ చేశారు. 'క్రీడా కిట్లు వచ్చే శాయ్' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితం కాగా స్పందించిన ఎంపీడీఓ అబ్దుల్‌హై క్రీడాకిట్లు పంపిణీ ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ కార్యాలయానికి పిలిపించి మండలానికి మంజూరైన మొత్తం 36క్రీడా కిట్లను ఎంపీఓ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ చారి, కార్యదర్శులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రత్యేక డ్రైవ్

పాతమంచిర్యాల: విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే నర్సింగ్ సిబ్బంది, కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులు, నర్సింగ్ సిబ్బందికి గల్ఫ్ దేశాలతో పాటు కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, హంగేరీ, పోలాండ్, రొమేనియా, యూకే దేశాలలోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని కరీంనగర్, రామగుండం, మంచిర్యాలలో నిర్వహిస్తుందన్నారు. అక్టోబర్ 04న టాస్క్ రీజినల్ సెంటర్ ఐటీ టవర్స్ ఉజ్వల పార్క్ ఎదురుగా బైపాస్‌రోడ్ కరీంనగర్‌లో, అక్టోబర్ 05న రామగుండం ప్రభుత్వ ఐటీఐ బ్రాహ్మణపల్లిలో, అక్టోబర్ 06న ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాలలో ఉద్యోగుల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు, ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమానికి ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ ఐటీఐలో సీట్లు భర్తీ కోసం ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఐటీఐ ప్రిన్సిపల్ చందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న కాపీలతో పాటు ఇతర విద్యార్థి సర్టిఫికెట్లను ఈ నెల 9 అడ్మిషన్ కోసం ఐటీఐకి రావాల్సిందిగా సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత



చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో ర్యాలీలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు



హాజీపూర్‌లో పాల్గొన్న అధికారులు



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూర్: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ డివిజనల్ అధికారి రమేశ్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వన్యప్రాణుల రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: 69వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అటవీశాఖ డివిజన్ కార్యాలయం నుంచి మండలంలోని కిష్టంపేట జోడువాగులు సమీపంలోని అర్బన్ పార్కు వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎఫ్‌డీవో ఎస్. రమేష్ వన్యప్రాణుల సంరక్షణ గురించి అటవీశాఖ సిబ్బందికి తెలయజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శివకుమార్, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి మండలాల అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంసీసీ క్వారీలోని దుర్గాదేవి ఆలయ ఆవరణలో అటవీ అధికారులు పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేపట్టారు. దుర్గాదేవి ఆలయ పరిసరాల్లోని చెత్త, చెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి నాగావత్ స్వామి, సినిమా దర్శకుడు పన్యాల రాజ్‌కుమార్, సినీగీత రచయిత అక్కల చంద్రమౌళి, ఆల్ ఇండియా రైడర్, జంతు ప్రేమికుడు కొండ సిద్దార్థ్, అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా లక్సెట్టిపేట మున్సిపల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ కాంతయ్య

లక్సెట్టిపేట: మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన మంగళవారం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. సమావేశంలో ఇప్పటివరకు నిర్వహించిన అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేయాల్సిన పనులపై మాట్లాడారు. దసరా, బతుకమ్మ పండుగ సంబరాల ఏర్పాట్లపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం కోసం విద్యుత్ దీపాలు, పరిశుభ్రత, పిచ్చిమొక్కలు తొలగించుట ఇతర పనులను త్వరగా పూర్తి చేయాలని తీర్మానం చేశారు. పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి అయినందునా, వివరాలను సేకరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస గౌడ్, కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ శ్రీహరి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కరెంటు సమస్య తీర్చాలని ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న ముల్కల్ల గ్రామస్తులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఐదు నెలలుగా కరెంట్ సరఫరాలో పదేపదే అంతరాయం కలుగుతుందని హాజీపూర్ మండల ముల్కల్ల గంగవాడ గ్రామస్తులు మంగళవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఏడీఈ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత మార్చి నెల నుంచి పదేపదే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని వాపోయారు. పలుమార్లు స్థానిక ఏఈకి ఫిర్యాదు చేయగా, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసి పునరుద్ధరిస్తున్నా మళ్లీ కొద్దిరోజుల్లోనే కాలిపోతున్నట్లు ఆరోపించారు. లో ఓల్టేజీ సరఫరాతో ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయి నష్టపోతున్నట్లు తెలిపారు. రాత్రిళ్లు దోమలతో సావాసం చేయాల్సి వస్తుందని, చీకట్లో అనేక అవస్థలు పడుతున్నామన్నారు. పలుమార్లు ఏఈతోపాటు, ఏడీఈకి ఫిర్యాదు చేశామని అయినా సమస్య పరిష్కరించడం లేదన్నారు. ఎస్ఈ, డీఈకి ఫిర్యాదు చేస్తేనైన మా సమస్య పరిష్కారం అవుతుందని వచ్చామని, అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే గ్రామస్తుల మంతా వచ్చి ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దపల్లి రాజయ్య, నాయకిని సురేందర్, సిరిపెల్లి బాపు, మద్దెల కనకయ్య, శంకరయ్య, అంజనేయులు, మహేందర్, ఓదయ్య, సన్ని, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన డీఏవో



ఆస్నాదలో పత్తి పంటను పరిశీలిస్తున్న కల్పన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను జిల్లా వ్యవసాయాధికారి కల్పన మంగళవారం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఒత్కులపల్లి సమీపంలో సాగు చేస్తున్న బంతి తోట, చేపల చెరువును పరిశీలించారు. రైతులు సేంద్రీయ పద్ధతులలో పంటలు సాగు చేయాలన్నారు. ప్రస్తుతం పత్తి, వరి పంటల్లో చీడ, పీడలు సోకుతాయని, వాటి నివారణ చర్యలు పాటించాలన్నారు. ఆయిల్‌పాం సాగు, పండ్ల తోటల పెంపకంపై రైతులకు వివరించారు. బావురావుపేట, కిష్టంపేట, ఆస్నాద గ్రామాల్లో పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కవిత, ఏఈవోలు వనదేవి, శివరంజని, సాగర్, సాయికృష్ణ, రైతులు ఉన్నారు.

రోడ్డు ఊడ్చి.. నిరసన తెలిపి

కాసిపేట: సమ్మెలో భాగంగా సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో అంగన్‌వాడీలు మంగళవారం రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. పరిష్కరించే వరకు సమ్మె ఆగదని హెచ్చరించారు.

అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తాం

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలో ప్రారంభించిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో పాటు, పలు నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యతో కలిసి ప్రారంభించారు. 23వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించే రజక సంఘ భవనం, రూ.35లక్షలతో అంబేద్కర్ భవనం నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. రూ.70లక్షల టీయూఎఫ్‌డీసీ నిధులతో పాత మంచిర్యాలలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.20లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో 9వ వార్డు రంగంపేటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేయగా, రూ.90లక్షల పట్టణ ప్రగతి నిధులతో నిర్మించిన పార్కును ప్రారంభించి, అందులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి కసరత్తులు చేశారు. వార్డు కౌన్సిలర్ సునీత, మాజీ కౌన్సిలర్ కిషన్, డీసీసీబీ డైరెక్టర్ తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.

నస్పూర్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్‌లోని 14వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వార్డులోని సీసీ రోడ్లు, డ్రైన్‌లు, హైమాస్ట్ లైటింగ్, కబరిస్తాన్ కంపౌండ్ వాల్‌లకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు తిరుపతి, ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సర్‌లో గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం సంజీవరెడ్డి హాజరయ్యారు. ఉద్యోగులు, గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ధూమపానం, మద్యపానం అలవాట్లు మానుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం, వాకింగ్ చేయడం వల్ల రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అనంతరం గుండె జబ్బులకు అవగాహన కల్పించే కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ సీఎంవో రమేష్‌బాబు, ఏజెంట్ ఏవీ రెడ్డి, వైద్యులు వేద వ్యాస్, మురళీధర్ లోక్నాథ్ రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

శ్రీరాంపూర్: గనికి నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని ఆర్కే 7 గని మేనేజర్ సాయిప్రసాద్ తెలిపారు. గనిపై మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ఆర్కే 7 గని సెప్టెంబర్ నెలలో 102శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందు కూడా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం ఉద్యోగులు తమ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, అధికారులు రవీందర్, శ్రీనివాస్, రాజు, సంక్షేమ అధికారి శంతన్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ మెండ వెంకటీ, ఏఐటీయూసీ నాయకులు రవీందర్, ఐఎన్టీయూసీకి చెందిన శ్రీకాంత్, సీఐటీయూ శ్రీధర్, బీఎంఎస్ నాయకులు రాజేందర్ పాల్గొన్నారు.

105 శాతం ఉత్పత్తి

శ్రీరాంపూర్: ఆర్కే న్యూటెక్ గనికి సెప్టెంబర్ మాసంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 105% సాధించినట్లు గని మేనేజర్ ఈ స్వామిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందు కూడా ఉద్యోగులు కష్టపడి పనిచేసి నెలవారి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. అధిక ఉత్పత్తి సాధించినందుకు ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఇతర అధికారులు గని ఉద్యోగులను, అధికారులను అభినందించినట్లు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

నల్లబ్యాడ్జీలతో నిరసన

శ్రీరాంపూర్: కోలిండియాలో కార్మికుల వేతనాలు నిలిపివేసినందుకు నిరసన వ్యక్తం చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్కే 7గనిపై మంగళవారం యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేసి, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం 5శాతం ఐఆర్ ప్రకటించడంపై తెలంగాణ ఉద్యోగుల సంఘం నిరసన వ్యక్తం చేసింది. శ్రీరాంపూర్‌లోని ఐటీఐ వద్ద మంగళవారం తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం 25శాతం నుంచి 30శాతం ఐఆర్ ఇస్తుందని ఉద్యోగులు ఆశపడితే నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం ఏ ఉద్యోగ సంఘంతో కూడా చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు అనారోగ్యంతో మృతి



మల్లికార్జున్

చెన్నూర్: పట్టణానికి చెందిన ఎరినాగుల మల్లికార్జున్(35) అనే బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకుడు అనారోగ్యంతో మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కోటపల్లి మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన ఎరినాగుల ఓదెలు కుమారుడు మల్లికార్జున్ చెన్నూర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. విద్యార్థి దశ నుంచి బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘంలో చురుకైన కార్యకర్త, నాయకుడిగా పనిచేశారు. మల్లికార్జున్‌కు ఎనిమిదేళ్ల క్రితం కిడ్నీలు ఫెయిల్ కాగా, తండ్రి ఓదెలు కిడ్నీ దానం చేశారు. ఒక్క కిడ్నీతో జీవనం సాగిస్తున్న మల్లికార్జున్ ఆరు నెలల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. విద్యార్థి సంఘం నాయకుడు మల్లికార్జున్ మృతిపై ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కోటపల్లి మండల వైస్ చైర్మన్ వాల శ్రీనివాస్‌రావులతో పాటు బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి సంఘం నాయకులు విద్యాసాగర్, పార్టీ నాయకులు, విద్యార్థులు ప్రగాఢ సంతాపం తెలిపారు. లింగన్నపేటలో బుధవారం అంత్యక్రియలు జరుపనున్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలటౌన్: గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగిన స్టేట్ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనబర్చినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, మారయ్య తెలిపారు. 18ఏళ్లలోపు బాలుర విభాగంలో 400మీటర్ల హార్డిల్స్‌లో కె.ప్రణయ్ బంగారు పతకం, లాంగ్‌జంప్ 16ఏళ్లలోపు బాలికల విభాగంలో బి.శృతి సిల్వర్ మెడల్, 14ఏళ్లలోపు బాలికల విభాగంలో జి.నాగసాయిశ్రీ సిల్వర్ మెడల్, 20ఏళ్లలోపు బాలుర విభాగంలో 400మీటర్ల హార్డిల్స్‌లో జి.అంజి సిల్వర్ మెడల్‌ను సాధించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో...

మంచిర్యాలఅర్బన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 2న జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక దివ్యాపీ స్కాలర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బి.నిహాల్ కృష్ణన్, విక్షిత్, సాత్విక్‌లు తైక్వాండో పోటీల్లో మెరుగైన ప్రదర్శనతో రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్‌రావు తెలిపారు.

డాడ్జ్‌బాల్ పోటీలో జాతీయస్థాయికి ఎంపిక..

పెద్దపల్లి పట్టణంలో గాయత్రి విద్యాసంస్థలో ఈ నెల 2న రెండో రాష్ట్రస్థాయి డాడ్జ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో స్థానిక నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి శివకుమార్, మణీష్‌లు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, డీన్ వెంకటస్వామి, ఏవో సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

వాడల్లో దోమల నివారణ చర్యలు

- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు కొనసాగుతున్న స్పందన



ఫాగింగ్ చేస్తున్న మున్సిపాల్ సిబ్బంది

చెన్నూర్: మున్సిపాలిటీలో దోమలు విజృంభిస్తున్న నేపథ్యంలో దోమల నివారణ, పారిశుద్ధ్యంపై 'సాక్షి' మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్ నిర్వహించింది. ఫోన్‌ఇన్‌లో ప్రజలు దోమలు స్వైర విహారంతో రోగాల బారిన పడుతున్నామని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఫోన్‌ఇన్‌లో భాగంగా అధికారులు పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి దోమల నివారణ చర్యల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఇన్‌చార్జి శానటరీ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 13వార్డు పరిధిలోని లైన్‌గడ్డ, దుబ్బాగూడెం, ఫకీర్ వాడలలో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సమ్మయ్య పాల్గొన్నారు.

మధ్యంతర భృతి 20శాతం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న శ్రీనివాస్‌రావు, టీచర్లు

భీమారం: ప్రభుత్వం ప్రకటించిన 5శాతం మధ్యంతర భృతి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, 20శాతం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మధ్యంతర భృతిని పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్యదర్శి మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం ఉద్యోగులకు ఐఆర్‌ను 20శాతం ప్రకటించకుండా, కేవలం 5శాతమే ఐఆర్‌ను ప్రకటించడం బాధాకరమని ఇప్పటికైనా సీఎం మరోసారి పునఃసమీక్షించి ఉద్యోగులు కోరినట్లుగా పీఆర్సీ, డీఏలు, ఐఆర్‌ను ప్రకటించాలని టీఎన్జీవోస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రభుత్వం 5శాతం ఐఆర్ ప్రకటించడంపై టీఎన్జీవోస్ నాయకులు వారి అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, రెండో వేతన సవరణ కమిటీ(పీఆర్సీ)ని నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా సహాధ్యక్షులు శ్రీపతి బాపురావు, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన



భీమారం: భిక్షాటన చేస్తున్న మహిళలు

భీమారం/జన్నారం: సమస్యల సాధనకు చేపట్టిన సమ్మెలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం భిక్షాటన చేసి నిరసన చేశారు. పెండింగ్ బిల్లులతో పాటు సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జన్నారంలో సీఐటీయూ కార్యదర్శి బుచ్చయ్య, ఆయా మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

వేమనపల్లి: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న వేమనపల్లి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మంగళవారం కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ సంఘీభావం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బుడగ జంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

పాతమంచిర్యాల: బేడ బుడగ జంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, బేడ బుడగ జంగాల హక్కుల దండు రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మోతే సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో మంగళవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ ఉపకులాలలోని 57కులాలను గుర్తించి, తమ కమ్యూనిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల సీటు బీసీలకు కేటాయించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని కోరుతూ రేవంత్‌రెడ్డికి మంచిర్యాల కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ హైదరాబాద్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో రెండు టికెట్లను బీసీలకు ఇస్తామని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు అనుకూలంగా మంచిర్యాల సీటును బీసీ అభ్యర్థికి కేటాయించేలా చూడాలని కోరారు.

రాజ్యాంగ లక్ష్యాలను రక్షించుకోవాలి

వేమనపల్లి: బీజేపీ విధానాలతో సామాజిక న్యాయం సమాధవుతుందని, రాజ్యాంగ లక్ష్యాలు రక్షించుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ అన్నారు. కులవివక్ష పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంగళవారం వేమనపల్లిలోని జాజులపేటలో జెండావిష్కరించారు.

మాజీ సర్పంచ్ వెంకట నర్సింగారావు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప మామయ్య, మండల రైతుబంధు సమితీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు తండ్రి అయిన మాజీ సర్పంచ్ పూస్కూరి వెంకటనర్సింగారావు(82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. వెంకటనర్సింగారావు కుటుంబం మండలంలోని పీహెచ్‌సీ ఆస్పత్రితో పాటు ఆ వాస విద్యాలయానికి భూమిని విరాళంగా అందజేశారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి

నెన్నెల: యూపీలోని లఖింపూర్‌ఖేరిలో కేంద్రమంత్రి కొడుకు కారుతో రైతులను తొక్కించి చంపిన ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. లఖింపూర్‌ఖేరి మరణ ఖాండకు రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్‌డే నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ప్రవేశ గడువు పెంపు

దండేపల్లి: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 9 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చని, దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. అడ్మిషన్ పొందని వారుంటే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బతుకమ్మ చీరలొచ్చాయ్..!

భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): బతుకమ్మ చీరలు మంగళవారం హాజీపూర్, భీమారం తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకున్నాయి. భీమారం మండలానికి 6100 చీరలు మంజూరైనట్లు తహసీల్దార్ విశ్వంబర్ తెలిపారు. హాజీపూర్ మండలానికి 6,630 చీరలు వచ్చినట్లు తహసీల్దార్ సతీశ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ హరిత తెలిపారు. రేషన్ షాపుల ద్వారా మహిళలకు చీరలు అందించనున్నట్లు తెలిపారు.

నేడు బతుకమ్మ చీరల పంపిణీ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు మహేశ్వరి భవన్‌లో చీరల పంపిణీ ఉంటుందని తెలిపారు.

చేపపిల్లల పంపిణీ

జన్నారం: మండలంలోని జన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువులో మంగళవారం ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజోద్దీన్ చేతుల మీదుగా చేపలు వదిలారు.